క్లుప్తంగా

ఏఎస్పీని కలిసిన ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



ఏఎస్పీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట : రాజంపేట ఏఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేను సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కలిశారు. ఏఎస్పీ కార్యాలయంలో ఆయన చాంబరులో ఏఎస్పీకి శాలువా కప్పి, బొకేను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్పీతో పలు అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, న్యాయవాది గురుప్రతాప్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతిపెంచలయ్య, పార్టీ నేతలు సుబ్బరాజు, మల్లికార్జునరాజు, ఎంపీటీసీ మధు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ గడికోట వెంకటసుబ్బారెడ్డి తల్లి కొండమ్మ మృతి చెందారు. విషయం తెలుసకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే పాటూరు గ్రామానికి చెందిన కాసిరెడ్డి నరసింహారెడ్డి తల్లి శ్రీవాణి మృతి చెందడంతో ఆమె మృతదేహం వద్ద ఆకేపాటి నివాళి అర్పించారు. అనంతరం ఇరు కుటుంబాల వారిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

రాజంపేట : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కొత్తలూరు ఈడిగపల్లికి చెందిన సుబ్బరాయుడుకు రాజంపేట సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజులు జైలు శిక్ష విధించినట్లు మన్నూరు సీఐ అలీ తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన మన్నూరు ఏఎస్ఐ సుబ్బయ్య తన సిబ్బందితో కలిసి మన్నూరులోని సుదర్శన్ హాల్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా సుబ్బరాయుడు మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతుండగా ఏఎస్ఐ పట్టుకుని రాజంపేట సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జీషీటు సమర్పించగా ముద్దాయికి 14 రోజులు జైలు శిక్ష విధించగా సబ్ జైలుకు తరలించారు.

వాహన తనిఖీ

రైల్వేకోడూరు అర్బన్ : రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఎస్ఐ నవీన్‌బాబు సోమవారం చిట్వేల్ రోడ్డులో వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలోని దిబ్బలబడి వద్ద అర్బన్ ఎస్ఐ మహమ్మద్ జహీర్ తన సిబ్బందితో సోమవారం వాహనాల తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో వాహనాల సంబంధిత పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న పలువురికి జరిమానా విధించారు. అలాగే యూనిఫామ్ లేకుండా ఆటోలు నడుపుతున్న వారిని ఆపి కచ్చితంగా యూనిఫామ్ ధరించాలని తెలియజేశారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వండి

రైల్వేకోడూరు అర్బన్ : అర్హులైన ప్రతి గిరిజన, దళిత, మైనార్టీ నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత, గిరిజన, మైనార్టీ నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాకు వ్యవసాయ భూమి ఇవ్వాలని తెలిపారు. ఇప్పటికీ చాలామంది గుడిసెలలో జీవనం సాగిస్తున్నారని వారికి 3 సెంట్లు జాగా ఇచ్చి ఇండ్లు కట్టి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల విద్యాశాఖ అధికారిగా (ఎంఈఓ) ఎ.కోదండ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత పెరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎంఈఓను సత్కరించారు.

ఓబులవారిపల్లె ఎంఈఓగా..

ఓబులవారిపల్లె : మండల విద్యాశాఖ అధికారి-1 చక్రధర్ రాజు సోమవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంఈఓ-2 రెడ్డయ్య, ఎంఆర్సీ సిబ్బంది చక్రధర్ రాజును శాలువా, పూలమాలలతో సన్మానించారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టండి

పుల్లంపేట : కొమ్మనవారిపల్లి రెవెన్యూ గ్రామంలో మంగళవారం నుంచి నిర్వహించే రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ అరవింద కిషోర్ అన్నారు. సోమవారం వీఆర్ఓలతో వారు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

శివాలయంలో పూజలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులోని పురాతన కాలంనాటి నైనాదీశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితుడు చెంచు నరసయ్య, అర్చకులు చంద్రశేఖర్ శర్మల ఆధ్వర్యంలో అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వీరభద్రుడికి పల్లకి సేవ



ఆలయ మాఢ వీధుల్లో వీరభద్రస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో వెలసియున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో సోమవారం సాయంత్రం పల్లకి సేవను వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్ మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించగా ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజాది క్రతువులను జరిపారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి మేళతాళాలు భక్తుల నడుమ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ ఆలయ అర్చకులు అర్చనలు చేసి వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రారంభమైన ఉరుసు ఉత్సవం



అలంకరణలో మస్తుమియ్యా వలీ దర్గా

సిద్దవటం : మండల కేంద్రంలోని బత్తేరు కట్ట వద్ద వెలసిన హజరత్ మస్తుమియ్యా వలీ దర్గా గంధం మహోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హజరత్ మస్తుమియ్యా వలీ దర్గా వద్ద నుంచి జెండా ఊరేగింపును కడప – బద్వేల్ రహదారి మీదుగా మహబూబ్ సుభానీ దర్గా వద్దకు తీసుకెళ్లి అక్కడి నుంచి దర్గావద్దకు తెచ్చి జెండాను ప్రతిష్టించారు. మంగళవారం ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఉరుసు ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దర్గా కమిటీ సభ్యులు కోరారు.

గెలుపు సంబరం



విజేతగా నిలిచిన భువనగిరి లెవన్స్ జట్టు

పుల్లంపేట : మండల పరిధిలోని ఆర్.వడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 30 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజర్స్ తెలిపారు. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన ఈ క్రీడా సంబరాలు సోమవారం ఫైనల్‌తో ముగిసినట్లు వారు పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో భువనగిరి లెవన్స్, కమల్ లెవన్స్ మధ్య హోరాహోరీ మ్యాచ్ జరిగిందన్నారు. భువనగిరి 11 జట్టు విజేతగా నిలవగా రూ. 30 వేలు, రూ. 15 వేలు చిన్న రెడ్డయ్య రెడ్డి చేతులమీదుగా అందజేసినట్టు నిర్వాహకులు చెప్పారు. మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన మణికంఠ(41)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

అప్పులపాలవుతున్న టమాటా రైతు

- కనీస మద్దతు ధర లేక రైతులకు తప్పని నష్టాలు
- రూ.150 పలుకుతున్న 20 కేజీల క్రేట్
- కూలీలు కూడా రావడంలేదంటూ ఆవేదన



చిన్నమండెం మండలం దిన్నెమీదపల్లెలో టమాటా సాగు చేసిన రైతు

చిన్నమండెం : ఎంతో ఆశతో టమాటా సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. మండల వ్యాప్తంగా పలువురు రైతులు టమాటా పంటను సాగు చేసి అప్పుల బారిన కూరుకుపోతున్నారు. ధరలు లేక అప్పుల పాలవుతున్న రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని దిన్నెమీదపల్లెకు చెందిన రైతు గొనిపల్లి గురునాథ్ తనకు ఉన్న 2 ఎకరాలలో టమాటా పంటను సాగు చేశారు. ఎంతో ఆశతో చేసిన అప్పులు తీరుతాయనే తలంపుతో దాదాపు రూ.2.20 లక్షలు ఖర్చు పెట్టారు. మంచి ధరలు పలుకుతాయనే ఉద్దేశంతో టమాటా పంట సాగు చేస్తే ప్రస్తుతం మార్కెట్లో ధరలు చూసి రైతు విలవిలలాడుతున్నాడు. 20 కేజీల క్రేట్ ధర రూ.140 నుంచి రూ.150 పలుకుతోంది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే మరోమారు అప్పులే మిగిలేలా ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండల వ్యాప్తంగా టమాటా పంట సాగు చేసిన రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

రెండో ప్రధాన పంటగా..

మండలంలో రెండో ప్రధాన పంటగా రైతులు టామాటాను సాగు చేశారు. మండలంలోని చాలా గ్రామంలో వందల హెక్టార్లలో సాగు చేస్తుండగా చేతికొచ్చిన పంటను చాలా మంది రైతులు మదనపల్లె మార్కెట్‌కు తీసుకెళుతుండగా కూలీలకు కూడా డబ్బులు రావడంలేదని వాపోతున్నారు. ఖర్చు పెరిగినా ధరలు మాత్రం లేవని ఇలా అయితే వ్యవసాయం చేయడం తలకు మించిన భారమని కన్నీటి పర్యంతం అవుతున్నారు. ప్రతి యేడు టామాటా వల్ల ఎదురయ్యే నష్టాలను పూడ్చలేకున్నామని, ప్రత్యామ్నాయ వ్యవసాయం చేసేందుకు ధైర్యం చేయలేకున్నామని మండల రైతాంగం పేర్కొంటున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

మండలంతోపాటు నియోజకవర్గంలో టమాటాపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య ఎక్కువే. రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్‌లోనూ అధిక విస్తీర్ణంలో టమాటాను సాగు చేస్తుండగా ఎక్కువ మంది రైతులు ధరలు లభించక రైతులు నష్టపోవడమే కనిపిస్తోంది. ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల కోసం టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుకుంటున్నారు. అలానే టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేస్తే రైతులకు మంచి చేసిన వారవుతారని రైతాంగం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

అసలు కూడా వచ్చే పరిస్థితి లేదు



నాకు ఉన్న 2 ఎకరాలలో రూ.2.20 లక్షలు ఖర్చు పెట్టి టమాటా పంట సాగు చేశా. కానీ 20 కేజీల క్రేట్ రూ.140 – రూ.150 మార్కెట్లో ధర పలుకుతుండడంతో కడుపు తరుక్కుపోతోంది. అసలే వర్షాలు పడక తల్లడిల్లుతున్న తమకు ఈ నష్టాలు మరింత క్షోభకు గురిచేస్తున్నాయి. అప్పులు చేసి సాగు చేసిన టమాటా పంటతో కనీసం కూలీల ఖర్చు కూడా వస్తుందో రాదో అర్థం కావడం లేదు. ఇంత ఘోరమైన పరిస్థితులు తాను మునుపెన్నడూ ఎదుర్కోలేదు. దేవుడే మమ్మల్ని (రైతులను) కాపాడాలి.

– గొనిపల్లి గురునాథ్, రైతు, దిన్నెమీదపల్లె, చిన్నమండెం మండలం

పెట్టుబడిదారుల కోసమే విజన్ 2047

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం అమలు చేస్తామంటున్న విజన్ 2047 కేవలం పెట్టుబడిదారుల కోసమేనని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, ఎ.రామాంజులు విమర్శించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశలలో వారు మాట్లాడుతూ టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక విషయాల్లో ప్రజలను నిట్టనిలువునా దగా చేస్తున్నదంటూ ఆరోపించారు. మదనపల్లె సర్వజన ఆసుపత్రిలో వైద్యం పేదలకు దూరం చేయడంతో పాటు పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతున్న హార్సిలీహిల్స్ నిర్వహణను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి పాలకులు సిద్ధమవుతుండడం దారుణమన్నారు. హార్టికల్చర్‌కు ప్రసిద్ధిచెందిన రైల్వేకోడూరు ప్రాంతంలోని భూములను కార్పొరేట్ వ్యవసాయం అభివృద్ధిలో భాగంగా వ్యవసాయ భూములను లీజుపేరుతో రైతులను దగా చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుండడం దుర్మార్గమన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, సాగునీరు, తాగునీరు అందివ్వక, ఉద్యోగ అవకాశాలు కల్పించక, పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా పేదలను బానిసలుగా మార్చేందుకు నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు తీసుకుస్తున్నారంటూ వారు పాలకులపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వెంటనే తాము అనుసరిస్తున్న ప్రైవేటీకరణ అనుకూల విధానాలను మానుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామంటూ వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నేత రామాంజులు

ప్రత్యేక హోదాయే రాష్ట్రానికి సంజీవని

రాయచోటి జగదాంబసెంటర్ : విభజనతో ఆర్థికంగా కుదేలైన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని, ప్రత్యేక హోదాయే రాష్ట్రానికి సంజీవని లాంటిదని పీసీసీ జనరల్ సెక్రటరీ షేక్ అల్లాబకాష్, మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాలైనా, పరిశ్రమలైనా, పన్ను రాయితీలైనా ఇలా ఏదైనా ప్రత్యేక హోదాతోనే సాధించగలమన్నారు. ఈ విషయాన్ని టీడీపీ, జనసేన ఎందుకు అనుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రధాని మోడీ చేతిలో కీలుబొమ్మలుగా మారకుండా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడాలని వారు సూచించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్లాబకాష్, రెడ్డిసాహెబ్‌లు

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి రూరల్ మండలం శిబ్యాల గ్రామం రెడ్డివారిపల్లెలో వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలతో ఆయన మమేకమయ్యారు. కార్యకర్తలు, నేతలకు ఏకష్టం వచ్చినా తోడుంటానంటూ భరోసానిచ్చారు. పార్టీ బలోపేతం అంశంపై చర్చించారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి పబ్బం గడుపుకుని అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం గత 8 నెలలుగా హామీలను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ప్రతిరైతుకు పెట్టుబడి నిధి కింద రూ.20వేలు సహాయం చేస్తామని చంద్రబాబు చెప్పారని, ఈ పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి ద్వారా రూ.18వేలు ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం అమలుకు పంగనామాలు పెట్టారన్నారు. నిరుద్యోగ యువతకు అందిస్తామని చెప్పిన నిరుద్యోగ భృతికి ఎగనామం పెట్టారంటూ ఎద్దేవా చేశారు. జాబ్ క్యాలెండర్ అమలు మాటే ఎత్తడం లేదంటూ మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి ఏ పథకం అందకపోతుండడం వలన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ట్రూఆప్ చార్జీల పేరుతో విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నారని తెలియజేశారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు పోలు సుబ్బారెడ్డి, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, బోరెడ్డి నారాయణరెడ్డి, నాగేశ్వర, సాయినాథ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దివాన్, రామచంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రంగారెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్: నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: మంగమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

నివాళి

లక్కిరెడ్డిపల్లి : ఓ పత్రికా విలేకరి తల్లి, మద్దిరేవుల సర్పంచ్ అత్త మంగమ్మ (85) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి స్థానిక ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితో కలిసి మంగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితోపాటు మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సిద్దక రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, సిద్దక నాగిరెడ్డి, కాలాడి జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేంద్రనాథ్ రెడ్డి, నాయకులు నరసింహులు, పద్మనాభం, శ్రీనివాసులు, గంగయ్య, సుబ్బరాయుడు, గోపాల్, రమణయ్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సంబేపల్లె మండలంలో రోడ్డు ప్రమాదం

తమ్ముడు మృతి ; అన్నకు తీవ్ర గాయాలు




మృతి చెందిన ఖాదర్‌వలీ గాయపడ్డ సాయిపీర్




బోల్తాపడ్డ ట్రాక్టర్

సంబేపల్లె : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై ఎస్.సోమవరం గ్రామ సరిహద్దులలో సోమవారం రాత్రి ట్రాక్టర్‌ను కారు ఢీ కొనడంతో పాలగిరి ఖాదర్‌వలీ (29) అనే యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం కట్టుగుత్తపల్లెకు చెందిన అన్నదమ్ములు పాలగిరి ఖాదర్‌వలీ, సాయిపీర్‌లు కలిసి కలికిరి మండలంలో పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్ తీసుకెళ్లి పనులు పూర్తి చేసుకొని సొంత గ్రామానికి వస్తుండగా సంబేపల్లె మండలం సరిహద్దు సమీపంలోకి రాగానే పీలేరు వైపు నుంచి వస్తున్న కారు ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీ కొంది. దీంతో ట్రాక్టర్ జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడింది. కారు పక్కనే ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లోని తమ్ముడు ఖాదర్‌వలీ మృతి చెందగా, అన్న సాయిపీర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరుకున్న మృతుడి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య రెడ్డి ప్యార్, రెండు సంవత్సరాల చిన్నారి ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేద విద్యార్థుల చదువులకు సహకారం

ఓబులవారిపల్లె : పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివేందుకు సహకరించడమే మూగ శారద ఫౌండేషన్ లక్ష్యమని వ్యవస్థాపకుడు మూగ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఫౌండేషన్ తరపున మెరిట్ ఉన్న పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మూగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ తన భార్య మరణం అనంతరం శారద ఫౌండేషన్‌ను స్థాపించి ప్రభుత్వ పాఠశాలలో రాణించిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రతి సంవత్సరం రూ. 5 వేలు చొప్పున స్కాలర్ షిప్‌లను క్రమం తప్పకుండా ఇస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 25 మందికి స్కాలర్ షిప్‌లను అందజేస్తున్నామని చెప్పారు. అలానే పాఠశాల గత పది పరీక్షలలో టాపర్‌కు రూ. 10 వేలు చెక్కును అందజేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, విశ్రాంత ఉపాధ్యాయులు అబ్బిగారి వేణుగోపాల స్వామి, ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ ఓజీ నాగిరెడ్డి, రైల్వేకోడూరు పంచాయతీరాజ్ ఏఓ గౌరీ శంకర్, ఉపాధ్యాయులు రాజునాగయ్, రవికుమార్, నరసింహారెడ్డి, రాజు, చంగా శ్రీనివాసులు, టి.యువరాజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేస్తున్న శంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు

రీ సర్వేకు సహకరించాలి

రామాపురం : గ్రామాలలో జరుగుతున్న భూ రీ సర్వేకు ప్రజలు సహకరించాలని భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కృపావతి పేర్కొన్నారు. మండలంలో రెండవ విడత భూ రీ సర్వేలో భాగంగా సోమవారం నుంచి నల్లగుట్టపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వేను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు తమ భూముల వద్ద ఉండి హద్దులు చూపించి సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, టీడీపీ నాయకులు చిలేకంపల్లి శివారెడ్డి, వీఆర్ఓలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే కఠినచర్యలు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని ప్రధాన మార్గాలలో ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో స్టేట్‌బ్యాంక్, మోర్ సూపర్ మార్కెట్ ఎదుట ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకున్న వారిపై సీఐ ఆగ్రహించారు. తన సిబ్బందితో కలసి ఫుట్‌పాత్‌పై నడవడానికి అడ్డంగా ఉంచిన వాహనాలను తొలగించారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసేవారిపై చర్యలు తప్పవన్నారు. పట్టణంలో నో పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను నిలిపినా, చట్టవిరుద్ధంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ డైరెక్షన్‌లో వాహనాలను నడిపి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవంటూ ఆయన హెచ్చరించారు.



మోర్ సూపర్ మార్కెట్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉంచిన వాహనాలను తొలగింపచేస్తున్న ట్రాఫిక్ సీఐ

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారిణి వనిత

చిన్నమండెం : మామిడి పంటలు సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానవన శాఖాధికారిణి వనిత పేర్కొన్నారు. చిన్నమండెం మండల వ్యాప్తంగా ఉన్న మామిడి తోటలను ఆమె రైతులు, కంపెనీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృష్ణప్రసాద్, వ్యాపారవేత్త జయేష్ చవాన్, రైతులు, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

లక్కిరెడ్డిపల్లి : యువతకు స్వామి వివేకానంద ప్రేరణ కావాలని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, శ్రీ వెంకటేశ్వర యూత్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యువతకు స్వామి వివేకానంద జీవితం విశేషాలను ప్రిన్సిపల్ విద్యార్థులకు తెలియజేశారు. స్వామి వివేకానంద ఉద్బోధనలు మానవాళిని ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యూత్ డెవలప్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సోమల వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు సహదేవరెడ్డి, వెంకట కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద గురించి విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి

పశు వ్యాధులపై అవగాహన ఉండాలి

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లె, మంగళపల్లె గ్రామాలలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం డాక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకల వ్యాధుల బారిన పడుతున్నాయనే ఉద్దేశంతో గ్రామాలలో మేకలకు, గొర్రెలకు నట్టాల నివారణ మందులను అందించారు. 1526 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. అలానే 25 దూడలు, 57 ఆవులు, బర్రెలకు తదితర మూగజీవాలకు వైద్యం అందించామని చెప్పారు. అనంతరం పశు యజమానులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : మండల పరిధిలోని ఈడిగపల్లె, రాచంవాండ్లపల్లె గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను ఏడీ విజయ్ కుమార్ సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 46 పశువులకు ప్రథమ చికిత్స, 14 పశువులకు గర్భకోశ సమస్య, ఆరు పశువులకు కృత్రిమ గర్భధారణతోపాటు దూడలు, గొర్రెలు, మేకలకు నట్ల నివారణ మందులు, పారుడు వ్యాధులకు వ్యాక్సిన్లను వేశారు. కార్యక్రమంలో పశువుల డాక్టర్లు రవికుమార్, వెంకటేశ్వర రెడ్డి, సుండుపల్లె పశు సంవర్ధక శాఖ సిబ్బంది, గోపాల మిత్రాలు పాల్గొన్నారు.



సుండుపల్లె: పశుటీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు, సిబ్బంది